మహారాష్ట్రలో ఎన్‌కౌంటర్ ఇద్దరు నక్సలైట్లు మృతి

- మధ్యప్రదేశ్‌లో మరొకరు హతం

కొత్తగూడెం క్రైమ్, డిసెంబర్ 14: మహారాష్ట్రలోని గడ్చిరౌలి జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు నక్సలైట్లు మృతిచెందారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దులోని బోధిన్‌టోలా ప్రాంతం లో మావోయిస్టులు సమావేశమయ్యారన్న సమాచారం మేరకు పోలీసులు కూంబింగ్ చేపట్టారు. వీరి రాకను గుర్తించిన మావోయిస్టులు కాల్పులకు తెగబడటంతో పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు. దీంతో ఇద్దరు నక్సలైట్లు మరణించారు. వీరిలో ఒకరు 2019లో జాంబుల్‌ఖేడా పేలుడులో కీలక పాత్ర పోషించారు. మరో ఘటనలో మధ్యప్రదేశ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్ ఓ మావోయిస్టు హతమయ్యాడు. ఇతడిని బీజాపూర్‌కు చెందిన మడ్కం హిడ్మా అలియాస్ చైతూగా గుర్తించారు. ఇతడిపై 14 లక్షల రివార్డు ఉన్నది. మరోవైపు, ఛత్తీస్‌గఢ్‌లోని కాంకర్ జిల్లాలో మావోయిస్టుల మందుపాతర పేలడంతో బీఎస్ఎఫ్ జవాన్ ప్రాణాలు కోల్పోయారు.

పునరావృతం చేయొద్దనే బహిర్గతపరిచా

- నిజ్జర్ హత్య కేసులో భారత్ పాత్రపై కెనడా ప్రధాని ట్రూడో

టొరంటో, డిసెంబర్ 14: ఖలిస్థాన్ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో భారత్ పాత్ర ఉందంటూ చేసిన ఆరోపణలపై కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో మరోసారి స్పందించారు. ఏజెన్సీ కెనడియన్ ప్రెస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ భారత్ అలాంటి చర్యలను కెనడాలో పునరావృతం చేయొద్దనే తాను ఆ విషయాన్ని బహిర్గతం చేసినట్టు చెప్పారు. నిజ్జర్ హత్యపై ఆధారాలను త్వరలోనే వెల్లడిస్తామని పేర్కొన్నారు. నిజ్జర్ హత్యలో భారత్ ఏజెంట్ల పాత్ర ఉందంటూ ట్రూడో చేసిన వ్యాఖ్యలతో భారత్, కెనడా మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్న విషయం తెలిసిందే.

బయో కంప్యూటర్!

- మనిషి మెదడు, కృత్రిమమేధ కలయికతో పరికరం
- ఇండియానా వర్సిటీ శాస్త్రవేత్తల సరికొత్త ప్రయోగం
- శాస్త్ర, సాంకేతిక రంగంలో మరో విప్లవానికి నాంది

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): రజినీకాంత్ 'రోబో' సినిమా చూశారా? మామూలు సిలికాన్ రోబోకు కృత్రిమ మేధ (ఏఐ)ను జోడించి 'హ్యూమనాయిడ్ రోబో'గా మారుస్తారు. దీంతో మనుషులు చేసే అన్ని పనులను ఈ రోబో రెప్పపాటులోనే పూర్తి చేస్తుంది. అమెరికాలోని ఇండియానా వర్సిటీ బ్లూమింగ్టన్ శాస్త్రవేత్తలు ఇప్పుడు అలాంటి ప్రయోగాన్నే పూర్తి చేశారు. అదే 'బయో కంప్యూటర్'

ఏమిటీ బయో కంప్యూటర్?

గణనలు తప్ప విశ్లేషణలతో కూడిన క్లిష్టమైన పనులను సమన్వయంతో నిర్వర్తించడం ఎలక్ట్రానిక్ కంప్యూటర్లకు సాధ్యం కాదు. పరిసరాల్లో జరుగుతున్న మార్పులను బట్టి సరైనట్టు స్పందించడం వాటికి కుదరదు. దీంతో మనిషిలాగే సమయానుకూలంగా స్పందించే వినూత్న పరికరాన్ని తీసుకొచ్చేందుకు ఇండియానా వర్సిటీ శాస్త్రవేత్తలు నిర్ణయించారు. అదే 'బయో కంప్యూటర్'.

ఎలా తయారు చేశారు?

మెదడును పోలిన సూక్ష్మ అవయవాలను (బ్రెయిన్ ఆర్గనాయిడ్స్-బీవో) పరిశోధకులు ప్రయోగశాలలో తయారు చేశారు. వీటిలోనికి కృత్రిమ మేధ ప్రోగ్రామ్‌ను ఇంజెక్ట్ చేశారు. ఈ వ్యవస్థను ఎలక్ట్రానిక్ కంప్యూటర్‌కు అనుసంధానించారు.

పనితీరు ఇలా..

ఏఐతో అనుసంధానించిన బ్రెయిన్ ఆర్గనాయిడ్స్.. ల్యాబ్‌లో తయారుచేసిన మెదడులోని ఇతర నాడీకణాల్లో ఉత్తేజిత చర్యలను పురిగొల్పుతాయి. ఎలక్ట్రానిక్స్, ఏఐ, బీవో అనుసంధానంతో 'బయో కంప్యూటర్' విశ్లేషణను ప్రారంభిస్తుంది. అసంపూర్ణ, విరుద్ధ సమాచారం ఇచ్చినప్పుడు సాధారణ కంప్యూటర్ డీఫాల్ట్‌గా 'ఎర్రర్' మెసేజ్‌ను చూయిస్తుంది. అయితే, ఇలాంటి సమాచారాన్నే బయో కంప్యూటర్‌కు ఇస్తే.. ఎక్కడ తప్పుడు ఇన్‌పుట్ ఇచ్చామో.. సవరణలు ఎలా చేయాలో చెప్పడమే కాదు.. అవసరమైన ఫలితాలను అంచనాతో ఈ కంప్యూటర్ వెలువరిస్తుంది. సాధారణ కంప్యూటర్లలో ట్రాన్సిస్టర్లు సమాచారాన్ని నిల్వ చేసుకొంటే ఇందులో మెదడు కణాలే సమాచారాన్ని నిల్వ చేసుకొంటాయి. విశ్లేషిస్తాయి కూడా. ఇలా 'బయో కంప్యూటర్' సాధారణ సిలికాన్ కంప్యూటర్ పనులతో పాటు మనిషి మాత్రమే చేయగలిగే కొన్ని ప్రత్యేక పనులను కూడా చేస్తుంది.

ఎప్పుడు అందుబాటులోకి?

శాస్త్ర, సాంకేతిక రంగంలో ఇదో గొప్ప ప్రయోగమని, బయో ఇంజినీరింగ్, మెషిన్ లెర్నింగ్ వంటి సెక్టార్లలో బయో కంప్యూటర్ పాత్ర కీలకమని అంతర్జాతీయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ ప్రయోగం ప్రాథమిక దశలోనే ఉండటంతో ఫలితాలు కచ్చితత్వంతో రావడానికి మరికొంత సమయం పట్టొచ్చన్నారు. బయో కంప్యూటర్ మార్కెట్లోకి రావడానికి ఐదారేండ్లు వేచిచూడాల్సి రావొచ్చని అభిప్రాయపడుతున్నారు.

అప్పటివరకు ఉక్రెయిన్‌లో శాంతికి చోటులేదు

మాస్కో, డిసెంబర్ 14: తమ లక్ష్యాల్ని సాధించేవరకు ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనకు చోటులేదని రష్యా అధ్యక్షుడు పుతిన్ స్పష్టం చేశారు. మరి కొద్ది రోజుల్లో (2024 మార్చి 17న) రష్యా అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగబోతున్నవేళ చాలా రోజుల తర్వాత ఆయన మీడియా ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా పలువురు రష్యా పౌరులు, రెండోసారి సైనిక సమీకరణ చేపడతారా? పౌరుల్ని బలవంతంగా యుద్ధ క్షేత్రంలోకి పంపుతారా? అని పుతిన్ ముందు సందేహం వ్యక్తం చేశారు. అయితే.. రష్యాకు ఇప్పుడా అవసరం లేదని పుతిన్ సమాధానమిచ్చారు. ఉక్రెయిన్‌పై యుద్ధం ప్రకటించిన తర్వాత పుతిన్ మీడియా ముందుకు రావటం ఇదే మొదటిసారి. గురువారం మాస్కోలో జరిగిన మీడియా, టెలిఫోన్ కాల్, వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. విలేకర్లు, రష్యన్ పౌరుల నుంచి ఎదురైన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్, గాజా సంక్షోభం, రష్యా ఆర్థిక పరిస్థితి.. తదితర అంశాలపై ఆయన మాట్లాడారు. దాదాపు 24 ఏండ్లుగా రష్యాను ఏలుతున్న పుతిన్, మరోసారి అధ్యక్ష పదవి ఎన్నికల బరిలో నిలబడుతున్నారు. ఎన్నికల్లో బలమైన ప్రత్యర్థి ఎవరూ లేకపోవటంతో, పుతిన్ ఎంపిక దాదాపు లాంఛనమేనని చెప్పాలి.

పైలట్ కావాలని కలలు కన్నా

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గురువారం తన చిన్ననాటి కలలు, ఆశయాల గురించి ప్రజలతో పంచుకున్నారు. పైలట్ కావాలని తాను చిన్నప్పుడు కలలు గనేవాడినని, తర్వాత ఇంటెలిజెన్స్ ఆఫీసర్‌ని అవ్వాలనుకున్నానని పుతిన్ వెల్లడించారు. వ్యక్తుల వయస్సు, చుట్టుపక్కల పరిసరాలు, మనుషుల ప్రభావం వల్ల ప్రాధాన్యతలు కూడా మారుతూ ఉంటాయని, అలాగే తన తన ఇష్టాయిష్టాలు కూడా మారాయని ఆయన చెప్పారు. అయితే ఇంటెలిజెన్స్ అధికారి కావాలన్న తన కల నెరవేర్చుకున్నట్టు ఆయన తెలిపారు. రష్యా అధ్యక్షుడు కాకముందు కేజీబీ ఇంటెలిజెన్స్ అధికారిగా పనిచేసిన పుతిన్ 24 ఏండ్ల పాటు ఆ దేశానికి అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

రామాలయం విగ్రహాల తయారీలో ముస్లిం శిల్పులు

కోల్‌కతా: అయోధ్య రామాలయం నిర్మాణంలో మత సామరస్యం వెల్లివిరుస్తున్నది. శ్రీరాముని విగ్రహాల తయారీలో ముస్లిం శిల్పులు భాగస్వాములయ్యారు. పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలోని మహమ్మద్ జమాలుద్దీన్, బిట్టు (తండ్రీకొడుకులు) తయారు చేసిన అద్భుతమైన శ్రీరాముని విగ్రహాలను రామాలయంలో ఏర్పాటు చేయబోతున్నారు. వీరిద్దరి నైపుణ్యాన్ని ఆన్‌లైన్ ద్వారా తెలుసుకున్న రామాలయం ట్రస్ట్ విగ్రహాల తయారీకి వీరికి ఆర్డర్ ఇచ్చింది. జమాలుద్దీన్ మాట్లాడుతూ, ఒక్కొక్క విగ్రహం రూ.2.8 లక్షలు ఉంటుందని, అయితే వీటి తయారీలో పనితనం కూడా అదే స్థాయిలో ఉంటుందన్నారు. శ్రీరాముని విగ్రహాన్ని తయారు చేయడం చాలా సంతోషకరమని తెలిపారు. తాను దుర్గామాత, జగద్ధాత్రి విగ్రహాలను కూడా తయారు చేస్తానన్నారు.

ఆత్మహత్యకు అనుమతివ్వండి

లైంగిక వేధింపులపై సీజేఐకి మహిళా జడ్జి లేఖ

లక్నో, డిసెంబర్ 14: పని ప్రదేశంలో లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నానని ఏకంగా ఓ మహిళా జడ్జి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నిమార్లు ఫిర్యాదుచేసినా చర్యలు తీసుకోవటం లేదని, శారీరక, మానసిక వేధింపులను ఇక ఎదుర్కోలేనని, ఆత్మహత్య చేసుకునేందుకు అనుమతివ్వాలని ఉత్తరప్రదేశ్ బాందా జిల్లా సివిల్ జడ్జి అర్పితా సాహూ సీజేఐకి తాజాగా రెండు పేజీల లేఖ రాశారు. బారాబంకి సివిల్ కోర్టులో జిల్లా జడ్జి నుంచి తరుచూ అనుచిత డిమాండ్లు వచ్చేవని, రాత్రి సమయాల్లో కలవాలని ఒత్తిడి తీసుకొచ్చేవాడని లేఖలో ఆమె ఆరోపించారు. ఈ వ్యవహారంపై అనేక మార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవటంతో, ఆత్మహత్యకు సిద్ధమవుతున్నట్టు తెలిపారు. ఇందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సీజేఐ చంద్రచూడ్‌కు లేఖ రాశారు. 'మహిళా జడ్జి ఇలాంటి పరిస్థితిలో ఉంటూ, ఇతరులకు ఎలా న్యాయం చేయగలదు? నేను చేసిన ఫిర్యాదులపై ఎలాంటి విచారణ జరపకుండా వాటిని కొట్టిపారేస్తున్నారు. ఇక నాకు బతకాలని లేదు. ఇలాంటి జీవితాన్ని కొనసాగించలేను' అంటూ అర్పితా సాహూ తన ఆవేదన వెళ్లగక్కారు.

ఇండియాలో అందుబాటులోకి గ్రోక్

న్యూఢిల్లీ, డిసెంబర్ 14: ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ కృత్రిమ మేధ స్టార్టప్ ఎక్స్ఏఐ తన ఏఐ చాట్‌బాట్ గ్రోక్ సేవలను ఇండియాతో పాటు 46 దేశాల్లో అందుబాటులోకి తెచ్చింది. ఈ చాట్‌బాట్ ఎక్స్ ప్రీమియం+ చందాదారులకు మాత్రమే అందుబాటులోకి వచ్చింది. ఎక్స్ ప్రీమి యం+ వాడకందారులు వెబ్, ఐఓఎస్, ఆండ్రాయిడ్ సైడ్ మెనులో గ్రోక్‌ను గుర్తించవచ్చు.

యూనివర్సిటీ స్థాపించనున్న మస్క్

ఎలాన్ మస్క్ అమెరికాలోని ఆస్టిన్‌లో యూనివర్సిటీ స్థాపించే ఆలోచనలో ఉన్నట్టు బ్లూమ్‌బర్గ్ తెలిపింది. సుమారు 100 మిలియన్ డాలర్లను మస్క్ ఈ యూనివర్సిటీకి విరాళంగా ఇవ్వనున్నారు. మొదట స్టెమ్ కోర్సులకు ప్రాధాన్యమిస్తూ ప్రాథమిక, సెకండరీ పాఠశాలలను ప్రారంభించాలని యోచిస్తున్నట్టు సమాచారం.

కాల్పుల విరమణ ప్రసక్తే లేదు

చివరి వరకు పోరాడతాం: నెతన్యాహు

జెరూసలెం, డిసెంబర్ 14: హమాస్‌తో జరుగుతున్న యుద్ధంలో కాల్పుల విరమణ పాటించాలన్న అంతర్జాతీయ సమాజం కోరికను ఇజ్రాయెల్ తోసిపుచ్చింది. యుద్ధాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేసింది. 'మేం చివరి వరకు కొనసాగిస్తాం. అందులో మరో ప్రశ్న లేదు. మమ్మల్ని ఏదీ ఆపలేదు' అని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తెలిపారు. షిజైయహ్ మిగతా ప్రాంతాల్లో కొన్ని రోజులుగా భారీగా యుద్ధం కొనసాగుతున్నది. వేలాది మంది గాజా తూర్పు ప్రాంతం లోనే ఉండిపోయారు. తాము ఇండ్లకు తిరిగి వెళ్లలేమేమోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పొలిటికల్ కెరీర్ కోసం మతం మారను

అమెరికా అధ్యక్ష అభ్యర్థి రామస్వామి

వాషింగ్టన్, డిసెంబర్ 14: తాను హిందూనని, పొలిటికల్ కెరీర్ కోసం మతం మారబోనని ఇండియన్-అమెరికన్ వివేక్ రామస్వామి తేల్చిచెప్పారు. రిపబ్లికన్ పార్టీ తరపున అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వం ఆశిస్తున్న ఆయనను.. హిందూ నేతను అమెరికా అధ్యక్షుడిగా అంగీకరిస్తుందా? అని మీడియా ప్రశ్నించగా.. 'నేను హిందూ.. పొలిటికల్ కెరీర్ కోసం మతం మారను' అని కుండబద్దలు కొట్టారు. హిందూమతం, క్రైస్తవ మతం ఉమ్మడి విలువలు కలిగి ఉంటాయని చెప్పారు. 'నేను రాజకీయంగా జీవితంలో ఎదగాలనుకుంటే మతం మార్చుకోవచ్చు. కానీ, నేను అలా చేయబోను.' అని పేర్కొన్నారు.

చిత్రం

నాగ్ 'లవ్ యాక్షన్ రొమాన్స్'

సినిమాల విషయంలో కాస్త నిదానించిన అగ్ర హీరో నాగార్జున ఉన్నట్టుండి వేగం పెంచేశారు. ప్రస్తుతం నాగ్ 'నా సామిరంగ' సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా సంక్రాంతికి విడుదల కానుంది. ఆ వెంటనే మరో సినిమాను కూడా లైన్లో పెట్టేశారు నాగ్. తమిళ దర్శకుడు అనిల్ చెప్పిన కథ నచ్చడంతో ఆ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు. ఈ సినిమాకు 'లవ్ యాక్షన్ రొమాన్స్' అనే పేరు పరిశీలనలో ఉంది. త్రిష ఇందులో కథానాయికగా ఎంపికైనట్టు సమాచారం. గతంలో 'కింగ్' సినిమాలో నాగార్జునతో జతకట్టింది త్రిష. ఆ సినిమా మంచి హిట్. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత ఈ కాంబినేషన్ సెట్టయ్యిందన్న మాట. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సివుంది.

పూజా హెగ్డే

ఆ వార్తను నమ్మొద్దు

అందాలభామ పూజాహెగ్డే దుబాయ్‌లోని ఓ కార్యక్రమానికి హాజరైంది. అక్కడ అనుకోకుండా పెద్ద గొడవ జరిగింది. ఏమైందో ఏమోగానీ కొందరు వ్యక్తులు చెలరేగిపోయి పూజా హెగ్డే మీదకు దూసుకొచ్చారు. 'చంపేస్తాం' అంటూ పూజాను బెదిరించారు. దీంతో పూజా హెగ్డే హడలిపోయి పరుగులంకించుకున్నది. ఏంటీ.. ఇదంతా నిజమే అనుకుంటున్నారా?.. ముంబయికి చెందిన ఓ ప్రైవేటు ఛానల్ వండివార్చిన తప్పుడు న్యూస్ ఇది. ఈ వార్త వల్ల కంగారుపడ్డ పూజా అభిమానులు.. 'ఏం జరిగింది?' అంటూ సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెడుతున్నారు. దీనిపై పూజ హెగ్డే మాట్లాడుతూ 'అసలు ఇలాంటి తప్పుడు రాతలు ఎందుకు రాస్తారో అర్థం కావట్లేదు. ఎవరూ ఈ వార్తను నమ్మొద్దు. ఇందులో ఎలాంటి నిజం లేదు. నాపై ఇలాంటి రూమర్లు సృష్టించినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా' అని చెప్పింది పూజాహెగ్డే

నేర ప్రపంచపు రారాజా.. రాక్షసరాజా



రానా

హిట్ సినిమా 'నేనే రాజు నేనే మంత్రి' తర్వాత దర్శకుడు తేజ, రానా కలిసి పని చేయలేదు. ఎట్టకేలకు మళ్లీ వీరి కాంబినేషన్ సెట్ అయ్యింది. త్వరలోనే ఇద్దరూ కలిసి పనిచేయనున్నారు. సినిమా పేరు 'రాక్షసరాజా'. పేరుకు తగ్గట్టే శక్తిమంతమైన కథ, కథనాలతో ఈ సినిమా ఉంటుందని సమాచారం. ఇందులో రానా గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నట్టు తెలిసింది. 'నేనే రాజు నేనే మంత్రి'ని మించే స్థాయిలో రానా కేరక్టరైజేషన్‌ని తేజ డిజైన్ చేసినట్టు తెలుస్తున్నది. హత్తుకుపోయే ఎమోషన్స్, కుటుంబ బంధాలతోపాటు నేరప్రపంచపు చీకటికోణాలు ఎత్తులు, పైఎత్తులూ అన్నీ ఈ కథలో ఉంటాయని సమాచారం. గురువారం రానా పుట్టినరోజు సందర్భంగా ఈ టైటిల్‌తో కూడిన పవర్‌పుల్ పోస్టర్‌ని విడుదల చేశారు. ఇందులో రానా విభూతి, తిలకం ధరించి సిగార్ కాలుస్తూ, చేతిలో తుపాకితో చాలా వైల్డ్‌గా కనిపిస్తున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు త్వరలో తెలియనున్నాయి.

వరుణ్‌తేజ్

1950 దశకం నాటి కథలో..

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా 'పలాస' ఫేమ్ కరుణకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'మట్కా' రెగ్యులర్ షూటింగ్ గురువారం మొదలైంది. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయేందర్ రెడ్డి తీగల, మోహన్ చెరుకూరి నిర్మిస్తున్నారు. 'యావత్ దేశాన్ని కదిలించిన ఓ యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. 1958-1962 కాలం మధ్యలో కథ నడుస్తుంది. వరుణ్‌తేజ్ నాలుగు భిన్నమైన గెటప్స్‌లో కనిపిస్తారు. హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో 50, 80ల నాటి వాతావరణాన్ని రీక్రియేట్ చేశాం' అన్నారు. మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి, నవీన్ చంద్ర, కిషోర్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఏ.కిషోర్ కుమార్, సంగీతం: జీవీ ప్రకాష్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: కరుణ కుమార్.

'కన్నప్ప'లో కథానాయికగా..

ప్రీతి ముకుందన్

మంచు విష్ణు టైటిల్ రోల్‌ను పోషిస్తున్న చిత్రం 'కన్నప్ప'. శ్రీకాళహస్తి స్థల పురాణం నేపథ్యంలో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో మంచు విష్ణు సరసన ప్రీతి ముకుందన్ కథానాయికగా నటించనుంది. ఆమెను తమ టీంలోకి ఆహ్వానిస్తూ గురువారం చిత్రబృందం ఓ ప్రకటన విడుదల చేసింది. దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ 'చాలా మందిని ఆడిషన్స్ చేసి చివరకు ప్రీతి ముకుందన్‌ను ఖరారు చేశాం. ఆమెకిది తొలి చిత్రం. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ప్రీతి..తన భరతనాట్య ప్రతిభతో పాత్రకు ప్రాణం పోస్తుందన్న నమ్మకం ఉంది. ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది' అన్నారు. 'కన్నప్ప' చిత్రంలో మోహన్‌బాబు, మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, ప్రభాస్ వంటి అగ్ర తారలు భాగం కావడంతో ఈ సినిమాకు జాతీయ స్థాయిలో ప్రాధాన్యత ఏర్పడింది.

'పిండం' ఓ భావోద్వేగ ప్రయాణం

శ్రీరామ్

'తల్లికడుపులో పెరిగే బిడ్డను 'పిండం' అంటాం. పోయాక ఆత్మశాంతికోసం పెట్టే భోజనాన్ని 'పిండం' అంటాం. ఒకటి జీవితాన్నిస్తుంది. ఇంకొకటి మరణం తర్వాత కూడా ఆనందాన్ని ఇస్తుంది. పైగా ఈ కథకు ఈ టైటిలే కరెక్ట్. ఇది కేవలం హారర్ సినిమా మాత్రమే కాదు. ఇదో భావోద్వేగ ప్రయాణం' అన్నారు హీరో శ్రీరామ్. ఆయన హీరోగా సాయికిరణ్ దైదా దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' ఉపశీర్షిక. యశ్వంత్ దగ్గుమాటి నిర్మాత. నేడు విడుదల కానుంది. ఈ సందర్భంగా శ్రీరామ్ విలేకరులతో ముచ్చటించారు. 'హారర్ సినిమాలంటే థియేటర్‌లో మనం చూసేటప్పుడు ఉలిక్కిపడేలా ఉండాలి. ఈ సినిమా అలాంటిదే. వర్తమానంతోపాటు 1930, 1990 కాలాల్లో నడిచే కథ ఇది.' అని హీరో శ్రీరామ్ అన్నారు. ఇంకా చెబుతూ 'నా దృష్టిలో భయంకరమైన సినిమా అంటే రామ్‌గోపాల్‌వర్మ 'రాత్రి'. నేను చాలాసార్లు చూసిన సినిమా అది. ఇంకా పలు ఇంగ్లీష్ హారర్ సినిమాలు కూడా చూశాను. వాటికి ఏ మాత్రం 'పిండం' తీసిపోదు. ఈ సినిమాను థియేటర్‌లో ప్రేక్షకుల మధ్య కూర్చొని చూడాలనుకుంటున్నాను' అని శ్రీరామ్ తెలిపారు.